ఎమ్మెల్సీ కవితను కలిసిన దుర్గాప్రసాద్

ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ తల్లి ప్రతిమను అందిస్తున్న దుర్గాప్రసాద్

పాల్వంచ, ఫిబ్రవరి 13: ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్ లోని ఆమె నివాసంలో బీఆర్ఎస్వీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు, రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపెల్లి దుర్గాప్రసాద్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం పోరాడేందుకు త్వరలో జిల్లాల వారీగా బీసీ విభాగ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిమను కవితకు దుర్గాప్రసాద్ బహూకరించారు.

8న జాతీయ లోక్ అదాలత్: భానుమతి

జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 13: మార్చి 8న కొత్తగూడెం కోర్టుల ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. యాక్సిడెంట్, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, వివాహ బంధాలు తదితర కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు.

ఆశ్రమ పాఠశాల, సబ్ జైల్ తనిఖీ

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను, వసతి గృహాన్ని, సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి గురువారం సందర్శించారు. రికార్డులను, మెనూను పరిశీలించారు. ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టును సందర్శించారు. ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగముని నాయక్

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 13: హైదరాబాద్ రామాంతపూర్ జేఎన్‌జీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన స్టేట్ లెవల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో స్థానిక ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి ఆర్.శ్రీకాంత్ ట్రిపుల్ జంప్‌లో మొదటి బహుమతి అందుకున్నాడు. సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆయనను ప్రిన్సిపాల్ నాగముని నాయక్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గ్రాట్యుటీ త్వరగా సెటిల్ చేయాలి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 13: గ్రాట్యుటీ త్వరగా సెటిల్ చేయాలని సింగరేణి ఏరియా డీజీఎం (పర్సనల్) రమేష్ ఆదేశించారు. ఆయన గురువారం సంక్షేమ అధికారులు, పీవోఏలు, ఆయా డిపార్ట్‌మెంట్ల మినిస్టీరియల్ స్టాఫ్‌తో సమీక్షించారు. 2020, 21, 22, 23, 24 సంవత్సరాల్లో గైర్హాజరైన కార్మికుల చార్జిషీట్ ఎంక్వైరీ ప్రక్రియను సమీక్షించారు. గత ఏడాది డిసెంబర్ 31 వరకు గ్రాట్యుటీ త్వరగా సెటిల్ చేయాలన్నారు. గ్రాట్యుటీ క్లెయిమ్స్ చేయని మాజీ ఉద్యోగులకు అడ్వాన్స్ గ్రాట్యుటీ చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ పీవోలు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, ఓంకార్ బాపు, సాయి శ్వేత, చంద్రకిరణ్, అరుణ్ తేజ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడులు.. ఇరువురిపై కేసులు..

జూలూరుపాడు, ఫిబ్రవరి 13: పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలో గురువారం ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. జూలూరుపాడు పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తవిశిగుట్ట తండాకు చెందిన బోడా కృష్ణ తన తమ్ముడు నర్సింహారావు ఇంట్లో భోజనం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు వచ్చి భోజనం చేస్తున్న కృష్ణను వీడియో తీస్తున్నాడు. వద్దని వారించినా వినకుండా వీడియో తీస్తూ కృష్ణపై దాడి చేశాడు. ఈ దాడిలో కృష్ణ చెయ్యి విరిగింది. మూతికి బలమైన గాయమైంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కోటోశ్వరరావు తెలిపారు. అలాగే, తవిశిగుట్ట గ్రామానికి చెందిన బోడా కృష్ణ, అతడి తమ్ముడు నర్సింహారావు కలిపి అదే గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావును మద్యం తాగేందుకు పిలిచారు. తనకు ఆరోగ్యం బాగా లేదని, మద్యం తాగనని చెప్పడంతో అన్నదమ్ములు వచ్చి నాగేశ్వరరావును కాళ్లతో తన్ని గాయపరిచారు. క్షతగాత్రుడి సోదరుడు భూక్యా భీమా ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన కృష్ణ, నర్సింహారావులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ కాయిల్ చోరీపై కేసు

జూలూరుపాడు, ఫిబ్రవరి 13: ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. మండలంలోని జూలూరుపాడు శివారులోని పోతురాజు జకరయ్య వ్యవసాయ పొలంలో వ్యవసాయ విద్యుత్ కోసం ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అందులోని కాపర్‌కాయిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీ చేశారు. ఈ ఘటనపై మండల విద్యుత్‌శాఖాధికారి సోములపల్లి సతీశ్ స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, JASTHI UDAYA BHARATHA LAKSHI as Written in passport curected and change as JASTHI UDAYA BHARATHA LAKSHMI there after read my name as JASTHI UDAYA BHARATHA LAKSHMI
KMM

GOLD FINANCE

★మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

WANTED

★ ప్రముఖ రియల్ ఎస్టేట్స్ ఆఫీసు, ఖమ్మం నందు అనుభవం కలిగిన డ్రైవర్స్, కారు డ్రైవర్‌గా పని చేయుటకు కావలెను. సంప్రదించవలసిన నెంబర్లు : 9985953170, 9640231009
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి

డయాలసిస్ సిబ్బందితో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చర్ల, ఫిబ్రవరి 13: రోగులతో వైద్యులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. చర్లలోని సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఇన్ పేషెంట్లను పలకరించి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం, విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ.. చర్లలో ఆపరేషన్ థియేటర్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, మార్చురీ గది ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన సిబ్బందిని నియమిస్తామన్నారు. తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, డాక్టర్ సాయివర్ధన్, డాక్టర్ కాంత్, డాక్టర్ జగన్, సీడీపీవో చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీల తనిఖీ

చర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని చింతకుంట, మొగళ్ళపల్లి ఇసుక క్వారీలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ పాయింట్లను పరిశీలించారు.

పర్ణశాల ఆలయం సందర్శన

పర్ణశాల, ఫిబ్రవరి 13: పర్ణశాల రామలయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం దర్శించారు. ఆలయ ప్రాంగణంలో తులసి మొక్కలను విరివిగా నాటించాలని అధికారులతో చెప్పారు. ఆలయ ఇన్‌చార్జ్ అధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

ఐటీడీఏ పీవో రాహుల్

అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 13: గిరిజన గ్రామాల్లో ఇంజినీరింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ విభాగం డీఈ, ఏఈలను ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశించారు. మండలాలవారీగా ఈ పనుల పురోగతిపై ఆయన గురువారం తన చాంబర్‌లో వారితో సమీక్షించారు. పీవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ పనులు పూర్తి స్థాయిలో జరగాలని అన్నారు. వైరాలో గిరిజన భవనం, పాఠశాల డార్మిటరీ నిర్మాణ పనులను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను పక్కన పెట్టి, వేరొకళ్లకు అప్పగించాలని ఆదేశించారు. గుండాల పీహెచ్‌సీ సిబ్బంది నివాస గృహాలు, గిరిజన గ్రామాల్లో రోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణ పనులను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న చిన్న మరమ్మతు పనులు ఉన్నట్లయితే ప్రతిపాదనలు సిద్ధం చేసి, వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. ఈఈ (ట్రైబల్ వెల్ఫేర్) చంద్రశేఖర్, డీఈ రాజు, ఏఈలు శ్రీకాంత్, హిమజ, విజయ్, మహేందర్ పాల్గొన్నారు.

19 మంది మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, ఫిబ్రవరి 13 : నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 19 మంది సభ్యులు లొంగిపోయినట్లు భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఏఎస్పీ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మావోయిస్టులు జన జీవనంలోకి వచ్చి సాధారణ జీవితం గడపాలనుకోవడం శుభపరిణామమని, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రశాంత జీవనాన్ని గడపాలని ఎస్పీ కోరారు. జనవరి నెలలో చర్లలో ఆపరేషన్ చేయూతలో భాగంగా లొంగిపోయిన మావోయిస్టులందరూ కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడుపుతున్నారని వివరించారు. లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యులకు జీవనోపాధితోపాటు పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) పరితోజ్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీతా, డిప్యూటీ కమాండెంట్(81 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్) రాజేష్ డోగ్రా, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం సీఐలు అశోక్, రాజు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలి

అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

అశ్వాపురం, ఫిబ్రవరి 13: వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని మణుగూరు ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ కోరారు. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఎలకలగూడెం, కొత్తూరు గ్రామాల్లో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై, వన్య ప్రాణి సంరక్షణపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. అటవీ చుట్టుపక్కల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రమాదవశాత్తు జరిగితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బండ్లవారి గుంపు గ్రామంలో ఫారెస్ట్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ధనలక్ష్మి, వెంకట్రావు, బీట్ ఆఫీసర్లు బాబూరావు, వాణి, సునీల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీ చేతిలో దేశం మగ్గుతోంది

అధికారం కోసం ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలనూ కులుస్తుంది: కూనంనేని

మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, ఫిబ్రవరి 13: రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్యంపైనా గౌరవంలేని బీజేపీ పాలకుల చేతిలో దేశం మగ్గుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చేసే పనిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని దుయ్యబట్టారు. అందులో భాగంగానే అక్రమ కేసులు పెడుతూ; సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తూ ప్రతిపక్షాలను భయపెడుతోందని ధ్వజమెత్తారు. పాల్వంచలో గురువారం నిర్వహించిన సీపీఐ భద్రాద్రి జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 మార్చి వరకు మావోయిస్టులను లేకుండా చేస్తామంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటనల వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నలు సంధించే వారిని గొంతెత్తకుండా చేయడమే బీజేపీ పాలకులు వారి అజెండాగా పెట్టుకున్నారని విమర్శించారు. సీపీఐ నేతలు సాబీర్‌పాషా, అయోధ్య, ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, సలీం, సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

భద్రాచలం, ఫిబ్రవరి 13: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.3లక్షల జరిమానా (నష్ట పరిహారం) విధిస్తూ భద్రాచలం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్ గురువారం తీర్పునిచ్చారు. ఎటపాక గ్రామస్తుడు వరకా శ్రీనివాసరావు, రూ.3లక్షలను పడిగ రాజేందర్‌రెడ్డి నుంచి తీసుకుని చెక్కు ఇచ్చాడు. చెప్పిన గడువులోగా అప్పును శ్రీనివాసరావు చెల్లించలేదు. దీంతో, ఆయన ఇచ్చిన చెక్కును రాజేందర్‌రెడ్డి బ్యాంకులో ఇచ్చారు. ఖాతాలో తగినంత నగదు లేకపోవడంతో ఆ చెక్కు బౌన్స్ అయింది. పడిగ రాజేందర్‌రెడ్డి, న్యాయవాది రావి రామ్మోహనరావు ద్వారా కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేశారు. దీనిని కోర్టు విచారించింది. వరకా శ్రీనివాసరావుపై నేరం రుజువవడంతో అతడికి రూ.3లక్షల జరిమానా(నష్ట పరిహారం)తోపాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శివనాయక్ గురువారం తీర్పునిచ్చారు.

బైక్‌ను ఢీకొన్న లారీ
ఇద్దరు మృతి

రాస్తారోకో చేస్తున్న మృతుల కటుంబీకులు

పర్ణశాల, ఫిబ్రవరి 13: దుమ్ముగూడెం మండలం భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి బైరాగులపాడు గ్రామ శివారులో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సుజ్ఞానపురం గ్రామస్తులు భూక్యా హరిబాబు(40), భూక్యా సోమ్లా(38) కలిసి బైక్‌పై చుంచుపల్లిలోని తమ బంధువుల ఇంట దశదిన కార్యక్రమాలకు గురువారం వెళ్తున్నారు. బైరాగులపాడు గ్రామ శివారులో భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై వీరి బైక్‌ను భద్రాచలం నుంచి చర్ల వైపు వెళ్తున్న లారీ (టీఎస్ 36 టీఏ 0435) ఢీకొంది. బైక్‌పై ఉన్న హరిబాబు, సోమ్లా తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పారిపోయేందుకు ప్రయత్నించిన లారీ డ్రైవర్‌ను బైరాగులపాడు గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో మృతుల కుటుంబీకులు రాస్తారోకోకు దిగారు. లారీ యజమాని రావాలని, తమకు న్యాయం చేయాలని సుమారు మూడు గంటలపాటు రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనకారులకు తహసీల్దార్ అశోక్ కుమార్, సీఐ బొడ్డు అశోక్ నచ్చజెప్పి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో, ఆందోళనకారులు వెళ్లిపోయారు. దుమ్ముగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. యువకుడు మృతి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 13: కారు బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఇల్లెందుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు డేరంగుల పోశం కుమారుడు డేరంగుల సాయి(30), గురువారం ఖమ్మం నుంచి ఇల్లెందుకు కారులో వస్తున్నాడు. కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామం వద్ద ఈ కారు బోల్తా పడింది. అందులో ఉన్న సాయి, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స జరుగుతుండగానే సాయి మృతిచెందాడు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

భద్రాచలం, ఫిబ్రవరి 13: రోడ్డు నిబంధనలపై భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య గురువారం యూనిట్ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహన నడిపితే నేరమని చెప్పారు.

డయాలసిస్ బాధితుడికి 'చేయూత'

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 13: మండలంలోని వేపలగడ్డ పంచాయతీ కొమ్ము నకిరిపేట గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు బాడిస బాలకృష్ణకు 'చేయూత' ట్రస్ట్ బాధ్యులు గురువారం రూ.5వేలు అందించారు. కైపు నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జామే మసీద్ సదర్‌గా షబ్బీర్ అహ్మద్

దమ్మపేట, ఫిబ్రవరి 13: స్థానిక జామే మసీద్ నూతన కమిటీని గురువారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా షేక్ షబ్బీర్ అహ్మద్(గడాఫీ), కార్యదర్శిగా సయ్యద్ వలీ, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్ ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 13: మండలంలోని బెస్తగూడెం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని సింగరేణి సేవా సమితి నిర్వహించింది. సింగరేణి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషగిరిరావు వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. ఏరియా డీజీఎం రమేష్, సిబ్బంది విద్యారాణి, శ్రవణ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

17న మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభం

టేకులపల్లి, ఫిబ్రవరి 13: స్థానిక సబ్ మార్కెట్ యార్డులో ఈ నెల 17న మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ నరేష్ తెలిపారు. ఆయన గురువారం వివిధ గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 13: భద్రాచలం రామాలయంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

ఎట్టకేలకు కాలనీలకు మంచినీళ్లు

తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని పలు కాలనీల్లో ఏర్పడిన మంచినీటి సమస్యను అధికారులు ఎట్టకేలకు పరిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు పరిధిలోని అంబేద్కర్ నగర్, గంగాహుస్సేన్ బస్తీలోని ప్రాంతాల్లో ఉన్న నీటి సమస్య గురించి స్థానిక ప్రజలు ఇటీవల మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయంపై మున్సిపల్ డీఈ రవికుమార్‌తో కమిషనర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించారు. ఎట్టకేలకు గురువారం ఉదయం ఆయా కాలనీలకు కిన్నెరసాని నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు.

బయోమైనింగ్ సందర్శించిన రీజినల్ డైరెక్టర్

బయోమైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న షాహిద్ మసూద్

ఇల్లెందు, ఫిబ్రవరి 13: ఇల్లెందులోని డంపింగ్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన బయోమైనింగ్ యంత్రాన్ని మున్సిపల్ వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ గురువారం పరిశీలించారు. దాని పనితీరును తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, ఎస్ఈ శ్రీనివాసరావు, అధికారులు దినేష్, శంకర్, అత్తహార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న జలగం యువసేన నాయకులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 13: సుజాతనగర్ మండలంలోని కోమటిపల్లి పంచాయతీకి చెందిన యువ రైతు కొర్రా రమేశ్ కుటుంబాన్ని జలగం యువసేన నాయకులు గురువారం పరామర్శించారు. ఇటీవల పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రమేశ్ కరెంట్ వేస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. గ్రామంలో గురువారం జరిగిన దశదిన కార్యక్రమానికి నాయకులు హాజరై రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బత్తుల వీరయ్య, చల్లి రవి, మామిడాల సాంబశివరావు, కత్తి బాలకృష్ణ, చిట్లూరి సుధీర్ కుమార్, కొర్ర శ్రీను, కొర్ర నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి: ఎన్‌డీ

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 13: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి కందగట్ల సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. పార్టీ నాయకులు నక్క లావణ్య, గణేశ్, శ్రీను, నాగేశ్వరరావు, రాములు, నవీన్, కోటయ్య, వెంకన్న పాల్గొన్నారు.

విస్తరణ పనులను వేగవంతం చేయండి

అధికారులతో మాట్లాడుతున్న ఈఈ యుగంధర్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 13: అశ్వారావుపేట పట్టణంలో డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని స్థానిక ఆర్ అండ్‌బీ అధికారులను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈఈ యుగంధర్ ఆదేశించారు. రింగ్ రోడ్డు సెంటర్లో రోడ్డును 50 అడుగుల వరకు విస్తరించాలని, డ్రైనేజీని కూడా అదే కొలతల పరిధిలో నిర్మించాలని సూచించారు. ఈ పనులను ఆయన గురువారం పరిశీలించారు. సత్తుపల్లి–జంగారెడ్డిగూడెం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. డీఈ బషీర్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 13: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వేదాంతపురం గ్రామస్తుడు దారా రమేష్, ఊట్లపల్లి గ్రామస్తురాలు షేక్ సుభాని.. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ క